సాక్షి నిజామాబాద్

గురువారం । 13 । ఫిబ్రవరి । 2025



యూజీసీ ముసాయిదా..

యూజీసీ ముసాయిదాను కేంద్రం ఉపసంహరించుకునే వరకు ఉద్యమించాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏ పున్నయ్య పిలుపునిచ్చారు.

- 8లో ▸



'తెల్ల'బోతున్న జొన్నలు

వారం రోజుల్లోనే తెల్లజొన్న ధరను వ్యాపారులు తగ్గించేశారు. ప్రారంభంలో క్వింటాల్ రూ.3,600కు కొనుగోలు చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.3 /18.9

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



నిజామాబాద్ రూరల్: ఉన్నతాధికారుల ఆదేశాల నేపథ్యంలో రాష్ట్రంలో రానున్న స్థానిక ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో సాయన్న సూచించారు. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల విధి విధానాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నియమావళికి సంబంధించిన బుక్‌లెట్‌లను రిటర్నింగ్ అధికారులకు అందజేశారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



నిజామాబాద్‌నాగారం: అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ పనితీరుపై బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం నుంచి ప్రత్యేక బృందం జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును పరిశీలించేందుకు రానున్నట్లు తెలిపారు. అన్ని కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. సుపోషిత్ గ్రామ పంచాయతీ అభియాన్ కింద ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో డీడబ్ల్యూవో షేక్ రసూల్ బీ, డీఎంహెచ్‌వో రాజశ్రీ , గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖల సీడీపీవోలు, పోషణ్ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

హాకీ జట్ల సారథులుగా స్వామి, స్వప్న



నిజామాబాద్‌నాగారం: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో తెలంగాణ సివిల్ సర్వీసెస్ హాకీ జట్లకు సారథులుగా జిల్లాకు చెందిన ఈట స్వామికుమార్, స్వప్న వ్యవహరించనున్నారు. ఈనెల 15 నుంచి 28 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడలో నిర్వహించనున్న టోర్నీకి వీరు ఎంపికయ్యారు. మహిళా జట్టుకు సారథిగా డిచ్‌పల్లి ఉన్నత పాఠశాల పీఈటీ స్వప్న, పురుషుల జట్టుకు సారథిగా జాకోర ఉన్నత పాఠశాల పీఈటీ స్వామి ఎంపికయ్యారు. ఇద్దరు జిల్లా వాసులు కావడం గర్వించదగిన విషయమని డీఈవో అశోక్‌కుమార్ అన్నారు. స్వామి, స్వప్నను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ సెక్రెటరీ నాగమణి, డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య, భారతి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ సెమినార్‌కు ఉపాధ్యాయుడు ఎంపిక

నిజామాబాద్‌అర్బన్: స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్(ఎస్‌సీఈఆర్‌టీ) తెలంగాణ ప్రతి ఏడాది నిర్వహించే సైన్స్ సెమినార్ పోటీలకు జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు చల్లా ముద్దుకృష్ణ ఎంపికయ్యాడు. 'తరగతి గదిలో విజ్ఞానశాస్త్ర ప్రమాణాలను పెంపొందించడానికి వినూత్న బోధనా పద్ధతులు' అనే అంశంపై సమర్పించిన ప్రాజెక్టును రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశారు. ముద్దుకృష్ణను పాఠశాల టీచర్లు అభినందించారు.

ఐదోసారి కేజీబీవీ టీచర్..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కేజీబీవీ జీవశాస్త్రం టీచర్ హన్మాండ్ల ప్రవంతి రాష్ట్రస్థాయి సైన్స్ సదస్సుకు ఎంపికయ్యారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఇన్ క్లాస్ రూం సైన్స్ టీచింగ్– ఇట్స్ ఇంపార్టెన్స్ అండ్ ఛాలెంజెస్' అనే అంశంపై ప్రవంతి రాసిన సెమినార్ పేపర్లను సదస్సుకు ఎంపిక చేశారు. ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో ఈ నెల 28న వర్చువల్ విధానంలో నిర్వహించనున్న సదస్సులో ప్రవంతి పాల్గొననున్నారు. సైన్స్ సదస్సుకు ప్రవంతి ఎంపిక వ్వడం ఇది ఐదోసారి. జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్ ఆమెను అభినందించారు.

భరోసా గందరగోళం



సిర్నాపల్లికి చెందిన మహిళా రైతు తలారి గంగవ్వకు ఎకరం ఏడు గుంటల భూమి ఉండగా, అందులో వరి సాగు చేస్తోంది. ఆమె ఖాతాలో ఈ లెక్కన రూ.7,050 రైతు భరోసా జమకావాల్సి ఉండగా, కేవలం ఏడు గుంటలకు సంబంధించి రూ.1050 మాత్రమే ఖాతాలో జమ చేశారు.

నల్లవెల్లి గ్రామానికి చెందిన రైతు బొల్లారం చిన్న గంగారాంనకు 0.38 గుంటల భూమి ఉంది. అందులో వరి సాగు చేశాడు. అతడి ఖాతాలో కేవలం ఆరు గుంటల భూమికి సంబంధించి రూ.900 మాత్రమే జమయ్యాయి.

- సాగులో ఉన్నా సగం భూమికే డబ్బులు!
- అయోమయానికి గురవుతున్న రైతులు
- సాయం దక్కని రైతులెందరో..

Farmer Details			
Bank Details(Bank , Branch , Acc No , IFSC Code)	Total Extent , Non Arable Extent, Arable Extent Paid Extent	Sub Survey Details	Total Amount
INDIAN BANK	1.0700	175/ఏ (0.2000	1050
SIRNAPALLI	0.0000	),891 (0.0300	
580532578	1.0700	),175/ఏ (0.2000	
IDIB000S065	0.0700	),889 (0.0400)	

సాగు భూమికన్నా తక్కువగా డబ్బులు జమైనట్లు ఆన్‌లైన్‌లో వివరాలు

ఇందల్వాయి: రైతు భరోసా సాయం కోసం ఎదురుచూసిన రైతులు ఇప్పుడు గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తమకు ఉన్న వ్యవసాయ భూమికి, బ్యాంకు ఖాతాల్లో జమవుతున్న పెట్టుబడి సాయానికి సంబంధం లేకపోవడంతో విస్మయానికి గురవుతున్నారు. ఎకరానికి రూ.12వేల చొప్పున అదీ సాగుయోగ్యమైన భూములకే సాయమందిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిన విషయం తెలిసిందే. కొందరికి తక్కువ డబ్బులు జమవుతుండగా, మరికొందరికి అసలే జమకాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

మొదటి విడతలో ఎకరం లోపు రైతులు

మొదటి విడతలో ఒక ఎకరం లోపు సాగుభూమి ఉన్న రైతులకు జనవరి 26 తర్వాత భరోసా సాయాన్ని ఇస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ లెక్కన జిల్లాలో 87,870 మంది రైతుల ఖాతాల్లో రూ.42.52 కోట్లు జమ కావాల్సి ఉంది. కాగా ఇప్పటికీ తమ ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని చాలా మంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం రెండు ఎకరాల లోపు రైతులకు కూడా రైతు భరోసా విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో సుమారు 2.60 లక్షల మంది రైతులు ఉండగా, వారందరికీ రైతు భరోసా అందాలంటే ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది.

ఎకరాకు భరోసా అందలేదు



నాకు నల్లవెల్లి గ్రామంలో ఎకరం సాగు భూమి ఉంది. ఇంతవరకూ రైతు భరోసా డబ్బులు జమకాలేదు. నాతోపాటు చాలా మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరు నెలలుగా అధికారులు చేసిన సర్వేలు, గ్రామ సభల్లో తేల్చిన లెక్కలు అన్ని హాస్యాస్పదంగా ఉన్నాయి. ఇకనైనా అధికారులు మేల్కొని అర్హులైన రైతులకు సకాలంలో రైతు భరోసా అందేలా చర్యలు చేపట్టాలి. – నోముల రాజులు, నల్లవెల్లి

సాంకేతిక లోపాలు సరిచేస్తున్నాం

రైతులు కంగారు పడొద్దు. రైతు భరోసా పంపిణీలో కొన్ని టెక్నికల్ సమస్యలున్నాయి. వీలైనంత తొందరగా వాటిని సరిచేసి అర్హులైన రైతులందరికీ సకాలంలో రైతుభరోసా అందేలా చూస్తాం. రైతులు తమ సందేహాల నివృత్తికి వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

– ప్రదీప్‌కుమార్, ఏడీఏ, నిజామాబాద్ రూరల్

ఎడపల్లి మండలం జానకంపేటలో..



వైభవోపేతం.. రథోత్సవం

దీక్షాపుర నివాసా.. సీతారామస్వామి గోవిందా.. గోవిందా. లక్ష్మీ నరసింహ గోవిందా.. గోవిందా.. అంటూ ఖిల్లా డిచ్‌పల్లి రామాలయం, జానకంపేట లక్ష్మీనరసింహుని ఆలయ పరిసరాలు మారుమోగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆయా చోట్ల బుధవారం రథోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను రథాలపై ఊరేగించగా, గోవిందా.. గోవిందా.. అంటూ భక్తులు తన్మయత్వంతో ముందుకు సాగారు. ఖిల్లా డిచ్‌పల్లిలో రాత్రి 10గంటలకు ప్రారంభమైన రథోత్సవం తెల్లవారు జామున 3గంటల వరకు కొనసాగింది. గురువారం జానకంపేటలో కుస్తీ పోటీలు, ఖిల్లా డిచ్‌పల్లిలో వన విహారం, చక్ర తీర్థం నిర్వహించనున్నారు. – డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) /ఎడపల్లి(బోధన్)



డిచ్‌పల్లి మండలం ఖిల్లా డిచ్‌పల్లిలో..

సీల్డ్ కవర్‌లో విచారణ నివేదిక

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్ సొసైటీలో నిధుల దుర్వినియోగంపై అధికారి సత్యనారాయణ విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. విచారణ నివేదికను ఆయన పాలకవర్గ సభ్యుల ఆమోదం కోసం సీల్డ్ కవర్‌లో పంపించారు. ఇటీవల నిర్వహించిన మహాజనసభలో కార్యదర్శి నివేదికను చదివి వినిపించగా, రూ.6,70,640 నిధులు దుర్వినియోగమయ్యాయని సొసైటీ డైరెక్టర్లు ఆరోపించారు. గతంలో విధులు నిర్వర్తించిన కార్యదర్శిపై విచారణ అధికారి నివేదిక ఆధారంగా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్సీ అభ్యర్థి గంగాధర్

- నామినేషన్ విత్ డ్రా చేసుకుని మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో పార్టీలో చేరిక



గంగాధర్‌కు కండువా కప్పుతున్న శ్రీధర్‌బాబు

ఆర్మూర్: కరీంనగర్–నిజామాబాద్–మెదక్–ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన మదనం గంగాధర్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకుని కాంగ్రెస్‌లో చేరారు. సీనియర్ నాయకుడు వీ హన్మంత్‌రావుతో కలిసి బుధవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌కు వచ్చిన గంగాధర్‌కు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని మంత్రి ఆయనకు సూచించారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన మదనం గంగాధర్ చిన్నతనంలో భిక్షాటన చేశారు. పేపర్ బాయ్‌గా పని చేశాడు. ఉన్నత చదువులు చదివి పోలీసు శాఖలో ఎస్సైగా ఉద్యోగం సాధించి డీఎస్పీ స్థాయికి ఎదిగారు. గతేడాది నవంబర్ మొదటి వారంలో తన ఉద్యోగం నుంచి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొని ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలువనున్నట్లు ప్రకటించారు. నాలుగు నెలలపాటు నాలుగు జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి యువత, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానంటూ ప్రచారం చేశారు. ఆర్మూర్ ప్రాంతానికి చెందిన యువత పెద్ద ఎత్తున ఆయన వెంట నిలిచారు. గంగాధర్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినప్పటికీ కాంగ్రెస్, బీజేపీల నుంచి బీ ఫామ్ ఆశించారు. ఆ పార్టీల నుంచి బీ ఫామ్ దక్కకపోవడంతో నామినేషన్ ఉప సంహరించుకుని కాంగ్రెస్‌లో చేరడం చర్చనీయాంశమైంది.

ఆపద వేళ తక్షణ సహాయం అందించాలి

- ఆపద మిత్రలకు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచన
- జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న శిక్షణ



రఘునాథ చెరువులో శిక్షణ పొందుతున్న ఆపద మిత్రలు



శిక్షణను పర్యవేక్షిస్తున్న అదనపు కలెక్టర్ కిరణ్

ఖలీల్‌వాడి: ప్రకృతి పరంగా, మానవ తప్పిదాల కారణంగా విపత్తులు సంభవించిన సమయంలో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆపద మిత్రలకు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, వరదలు, నీటి ప్రమాదాలు, భారీ జనసందోహంలో తొక్కిసలాట నివారణ, అత్యవసర పరిస్థితుల్లో అందించాల్సిన సేవలు తదితర అంశాలపై 22 రోజులపాటు మూడు దశల్లో ఆపద మిత్రలకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. వరదలు, నీటి ప్రమాద ఘటనలు చోటుచేసుకున్నప్పుడు చేపట్టాల్సిన సహాయక చర్యలపై ఆపద మిత్రలకు జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద రఘునాథ చెరువులో బుధవారం శిక్షణ ద్వారా అవగాహన కల్పించగా అదనపు కలెక్టర్ పర్యవేక్షించారు. రెస్క్యూ బోట్ ఆపరేటింగ్, రెస్క్యూ రోప్, ట్యూబ్, గార్డ్, ఫ్లోటర్ తదితర వాటి వినియోగంపై హైదరాబాద్‌లోని మణికొండకు చెందిన నోబుల్ లైఫ్ సేవింగ్ సొసైటీ మాస్టర్ ట్రైనర్లు మహేశ్, వినోద్, అనితా పటేల్ శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఆపద మిత్రలకు రూ.10 వేల విలువ చేసే విపత్తు సహాయ పరికరాలతోపాటు గుర్తింపు కార్డులు, బీమా సదుపాయాన్ని వర్తింపజేస్తామని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి టి పరమేశ్వర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఏ విక్రమ్, కలెక్టరేట్‌లోని విపత్తుల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఫస్ట్‌క్లాస్ కోర్టు వచ్చేనా?

- భీమ్‌గల్ వాసుల ఎదురుచూపులు
- 2007లో మంజూరైన కోర్టును ఆర్మూర్‌కు తరలించిన వైనం
- ఆరు మండలాల పరిధిలో 2,500 పైగా క్రిమినల్ కేసులు



భీమ్‌గల్ ముఖచిత్రం

ఆర్మూర్: భీమ్‌గల్ కేంద్రంగా జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఏర్పాటవుతుందని దశాబ్దాలుగా ఆరు మండలాల ప్రజలు, న్యాయవాదులు, పోలీసులు ఎదురు చూస్తూనే ఉన్నారు. భీమ్‌గల్, సిరికొండ, వేల్పూర్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల మండలాలకు చెందిన వారు క్రిమినల్ కేసుల విషయంలో ఆర్మూర్ వెళ్లాల్సి రావడంతో ఇక్కట్లు పడుతున్నారు. భీమ్‌గల్, సిరికొండ, వేల్పూర్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల వారి కోసం 2007లో భీమ్‌గల్ కేంద్రంగా జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టును హైకోర్టు మంజూరు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఆర్మూర్‌కు చెందిన కొందరు న్యాయవాదులు కేసుల నిమిత్తం భీమ్‌గల్‌కు వెళ్లడం ఇబ్బందిగా మారుతుందని భావించి కోర్టును ఆర్మూర్ కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేయించారు. అనంతరం రాజకీయ, అధికారిక పలుకుబడితో 2009–10 ప్రాంతంలో భీమ్‌గల్‌కు మంజూరైన జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టును ఆర్మూర్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టుగా మార్పించుకున్నారు.

వినతుల వెల్లువ

భీమ్‌గల్‌కు కోర్టు మంజూరు చేయాలని 2007 నుంచి ఈ ప్రాంతవాసులు వినతులు ఇస్తూనే ఉన్నారు. హైకోర్టు రాష్ట్ర వ్యాప్తంగా 39 జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టులను 2023 అక్టోబర్ 15న మంజూరు చేయగా, భీమ్‌గల్ ప్రాంతానికి చెందిన న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, సర్వసమాజ్ ప్రతినిధులు తమ ప్రాంతానికి సైతం కోర్టును మంజూరు చేయాలని విన్నవించారు. స్థానిక న్యాయవాది గజ్జెల చైతన్య ఆధ్వర్యంలో అప్పటి జిల్లా అడ్మినిస్ట్రేటీవ్ జడ్జి సుమలతోపాటు ఇప్పటి అడ్మినిస్ట్రేటీవ్ జడ్జి కే సురేందర్‌కు, హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటీవ్ చైర్మన్‌కు, జిల్లా జడ్జికి విన్నవించారు. దీంతో భీమ్‌గల్‌లో కోర్టు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై నివేదిక సమర్పించాలని 2023 నవంబర్ 8న ఆర్మూర్ కోర్టుకు ఆదేశాలు వచ్చాయి. 500 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్న పక్షంలో కొత్తగా కోర్టు మంజూరు చేసే అవకాశం ఉంటుంది. కాగా భీమ్‌గల్ పరిధిలోని ఆరు మండలాల్లో సుమారు 2,500 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. రెండున్నర లక్షలకు పైగా జనాభా ఉంది. ఈ లెక్కన భీమ్‌గల్‌లో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు ఏర్పాటుకు అన్ని అర్హతలున్నాయి.

సౌలభ్యం కోసం..



భీమ్‌గల్ ప్రాంతీయుల సౌలభ్యంతోపాటు కేసుల సత్వర పరిష్కారం కోసం భీమ్‌గల్ కేంద్రంగా జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు మంజూరు చేయాలని కోరుతున్నాం. ఈ ఆరు మండలాల పరిధిలో పరిష్కారానికి నోచుకోని కేసులతో కక్షిదారులు ఇక్కట్లు పడుతున్నారు. ఫలితంగా న్యాయం జరగడం ఆలస్యం అవుతోంది.

– గజ్జెల చైతన్య, న్యాయవాది, భీమ్‌గల్

అన్ని అర్హతలు ఉన్నాయి



భీమ్‌గల్ కేంద్రంగా జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నాయి. పెండింగ్ కేసులు, జనాభా పరంగా హైకోర్టు నిబంధనల ప్రకారం కోర్టు ఏర్పాటుకు అనువుగా ఉంటుంది. సిరికొండ మండలంలోని మారుమూల ప్రాంతాల నుంచి మహిళలు ఆర్మూర్ కోర్టుకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. – సూర సురేశ్, న్యాయవాది, భీమ్‌గల్

కొత్త రేషన్‌కు గ్రీన్ సిగ్నల్

- సాంకేతిక సమస్యను సరిచేసిన పౌరసరఫరాల శాఖ
- 'మీ సేవ'లో దరఖాస్తులకు అనుమతి



మోర్తాడ్ (బాల్కొండ): కొత్త రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు పౌర సరఫరాల శాఖ తీపికబురు చెప్పింది. మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. గత ప్రభుత్వం దాదాపు ఎనిమిది ఏళ్లపాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలు లేకుండా మీ సేవ పోర్టల్ నుంచి రేషన్ సర్వీసును తొలగించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత దరఖాస్తులు సమర్పించేందుకు సర్వీసును పునరుద్ధరించింది. మొదట ఈ నెల 7న ఆన్‌లైన్ దరఖాస్తులకు ఆమోదం తెలిపిన పౌర సరఫరాల శాఖ ఒక్క రోజు సర్వీసును కొనసాగించి మళ్లీ నిలిపివేసింది. ఎన్నికల కోడ్‌తోనే సర్వీసును నిలిపివేశారని అంతా భావించారు. కానీ, ఎన్నికల కోడ్ ఈ సర్వీసుకు వర్తించదని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. దీంతో సాంకేతిక సమస్యలను సరిచేసి సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం కల్పించింది.

ఎంపిక చేసిన గ్రామాల్లోనే కార్డుల పంపిణీ..

పదేళ్ల నిరీక్షణ తర్వాత కొత్త రేషన్ కార్డుల జారీని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరంభించినా పూర్తిస్థాయిలో అమలు జరగకపోవడంపై అనేక సందేహాలు వ్యక్తమయ్యాయి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జనవరి 26న ఒక్కో మండలంలో ఒక గ్రామంలోనే నాలుగు పథకాలకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. అందులో భాగంగానే జిల్లాలో 31 గ్రామాల్లో 1066 కుటుంబాలకే కొత్తరేషన్ కార్డులను జారీచేశారు. వాస్తవానికి కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజాపాలనలో 81,148 దరఖాస్తులు అందాయి. కానీ, ఎంపిక చేసిన గ్రామాల్లోనే కార్డులను అందించడంతో రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఆరంభ శూరత్వంగానే మిగిలిందనే అభిప్రాయం వ్యక్తమయ్యింది. తాజాగా మీ సేవ పోర్టల్‌లో రేషన్‌కార్డుల సర్వీసును పునరుద్ధరించడంతో కొత్తగా పెళ్లైన యువతుల పేర్ల నమోదు, పుట్టిన వారి వివరాలను అదనంగా చేర్చేందుకు అవకాశం ఏర్పడింది. ఇదిలా ఉండగా ప్రజాపాలనలో దరఖాస్తులు అందించిన వారు మళ్లీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవసరం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

అర్హులకు కార్డులు అందిస్తాం..

ప్రజాపాలనలో దరఖాస్తులు అందించని వారు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ సేవలు నిరంతరం కొనసాగే అవకాశం ఉంది. అర్హులైన వారికి రేషన్‌కార్డులను అందించేలా చర్యలు తీసుకుంటాం.

– అరవిందరెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

క్లుప్తంగా

ప్రయోగ పరీక్ష కేంద్రాల తనిఖీ



నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్‌ కళాశాలల్లో స్పెల్‌–2 ప్రయోగ పరీక్షలను జిల్లా ఇంటర్‌ విద్యాధికారి రవికుమార్‌ బుధవారం తనిఖీ చేశారు. కాకతీయ, ఎస్సార్‌, నిజామాబాద్‌ ప్రభుత్వ బాలికల జూనియర్‌ కళాశాలతోపాటు సత్య ఒకేషనల్‌ జూనియర్‌ కళాశాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజీయుద్దీన్‌ అస్లాం, కనకమహాలక్ష్మి, ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ బృందాలు మరో పది కేంద్రాలను తనిఖీ చేశారు.

10 సెల్‌ఫోన్‌ల అందజేత

బోధన్‌టౌన్‌(బోధన్‌): బోధన్‌ పట్టణ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు పట్టణ సీఐ వెంకటనారాయణ బుధవారం తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్లను సీఈఐఆర్‌ పోర్టల్‌ ద్వారా గుర్తించి అందజేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మాచారెడ్డి: గజ్యానాయక్‌ తండా చౌరస్తాలో బుధవారం రాత్రి ట్రాక్టర్‌ ఢీకొని ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని చుక్కాపూర్‌ గ్రామానికి చెందిన పెద్దోళ్ల నరేశ్‌ ద్విచక్రవాహనంపై చౌరస్తా నుంచి చుక్కాపూర్‌ వెళ్తుండగా కామారెడ్డి, సిరిసిల్ల రహదారిపై ఎదురుగా వచ్చిన ట్రాక్టర్‌ ఢీకొట్టింది. నరేశ్‌కు తీవ్ర గాయాలవ్వడంతో చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

వేల్పూర్‌: వేల్పూర్‌ మండలం కోమన్‌పల్లి గ్రామానికి చెందిన మెరుగు మల్లయ్య(63) చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్సై సంజీవ్‌ బుధవారం తెలిపారు. జనవరి 13న ద్విచక్రవాహనంపై కోమన్‌పల్లి వస్తుండగా కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలైన మల్లయ్యను నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘తెల్ల’బోతున్న జొన్నలు

- క్వింటాల్‌ తెల్లజొన్న రూ.3,200లకు కొనుగోలు
- రూ.400 తగ్గిన ధర
- సిండికేట్‌ వ్యూహమేనని ఆరోపణలు
- ఆందోళనలో అన్నదాతలు



ముప్కాల్‌ మండల పరిధిలో రోడ్డుపై ఆరబెట్టిన తెల్లజొన్నలు

బాల్కొండ: తెల్లజొన్న పంటకు వారం రోజుల వ్యవధిలోనే వ్యాపారులు ధర తగ్గించేశారు. ఈ ఏడాది కోతలు ప్రారంభించిన సమయంలో తెల్లజొన్నలు క్వింటాల్‌కు రూ.3,600లకు కొనుగోలు చేశారు. కానీ, వారం తిరగక ముందే క్వింటాల్‌కు రూ.400 తగ్గించటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌లో ఎర్రజొన్న కంటే తెల్లజొన్న పంటకు ధర తక్కువగా ఉంటుంది. మార్కెట్‌లో ఎర్రజొన్నలు క్వింటాల్‌కు రూ.3,800లు ఉన్నప్పుడు తెల్లజొన్నలు క్వింటాల్‌కు రూ.3,600లు పలికింది. ఎర్రజొన్న కంటే రూ.200 ధర తక్కువ పలికింది. తెల్లజొన్నకు తెగుళ్ల ప్రభావం తక్కువగా ఉండటంతో రైతులు ఎర్రజొన్నతో సమానంగా తెల్లజొన్నను సాగు చేశారు.

కానీ, ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్‌ లేదనే సాకు చూపుతూ వ్యాపారులు క్వింటాల్‌కు రూ.400లు తగ్గించారు. భవిష్యత్తులో ధర మరింత తగ్గుతుందని గ్రామాల్లో ప్రచారం చేయిస్తున్నారు. దీంతో తెల్లజొన్న సాగు చేసిన రైతులు అయోమయంలో పడ్డారు. జొన్నల ధర తగ్గడం వెనుక వ్యాపారుల సిండికేట్‌ వ్యూహం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వమే నేరుగా జొన్నలను కొనుగోలు చేస్తే ఎలాంటి తిప్పలు ఉండవని అభిప్రాయపడుతున్నారు.

ఎర్రజొన్నల ధర సైతం..

ఎర్రజొన్నల ధర కూడా వ్యాపారులు తగ్గించారు. మొదట క్వింటాల్‌ జొన్నలు రూ.3,800లకు కొనుగోలు చేసి, వారం తర్వాత రూ.3,700లకు కొనుగోలు చేస్తున్నారు. మున్ముందు మరింత తగ్గించి రూ.3,500లకు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఎత్తులు వేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. వ్యాపారుల సిండికేట్‌ను నిలువరిస్తేనే ధర తగ్గకుండా ఉంటుందని చెబుతున్నారు.

డిమాండ్‌ లేదంటున్నారు



తెల్లజొన్నలకు మార్కెట్‌లో డిమాండ్‌ లేదంటూ వ్యాపారులు ధర తగ్గించారు. ఒక్కసారిగా క్వింటాల్‌కు రూ.400 తగ్గించారు. ధర ఇంకా తగ్గుతుందని చెప్తున్నారు. ధర తగ్గింపుతో తీవ్రంగా నష్టపోతున్నాం.

– సతీష్‌రెడ్డి, రైతు

రూ.100 తగ్గించారు..



క్వింటాల్‌ ఎర్రజొన్నల ధర రూ.100 తగ్గించారు. వ్యాపారులు మొదట రూ.3,800లకు కొనుగోలు చేశారు. ప్రస్తుతం రూ.3,700లకు కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర తగ్గిస్తున్నారు.

– వకీల్‌, రైతు

భక్తజన సందడి



రథ హోమం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఆలయ కమిటీ, వీడీసీ సభ్యులు, భక్తులు

- వైభవంగా శ్రీసీతారాముల రథోత్సవం
- డిచ్‌పల్లి ఖిల్లాకు భారీగా తరలివచ్చిన భక్తులు



రథోత్సవానికి ముందు పూజలందుకుంటున్న శ్రీసీతారామ స్వామి ఉత్సవ విగ్రహాలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్రీ సీతారాముల ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు. ఆలయ ప్రధానార్చకులు సుమిత్‌ శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో ఉదయం నిత్య హోమం, బలిహరణం, సాయంత్రం హోమం, బలిహరణం, రథప్రతిష్ట, రథహోమం అనంతరం రథోత్సవం నిర్వహించారు. యాజ్ఞికులు భార్గవాచార్య, అర్చకులు ఆర్యన్‌ పాండే, గోపాల్‌ శర్మ, పంకజ్‌ శర్మ, కాకర్ల ప్రవీణ్‌, దేశ్‌పెద్ది ప్రసాద్‌, ప్రవీణ్‌ దేశ్‌పాండే, రామారావు దేశ్‌పాండే తదితరులు సుమారు రెండు గంటలపాటు విశేషపూజలు చేపట్టారు. రాత్రి 10 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు తెల్లవారుజాము 3గంటల వరకు కొనసాగింది. ఇళ్ల ముంగిటకు వచ్చిన శ్రీ సీతారామచంద్రస్వామి వారికి సుహాసినులు మంగళహారతులతో స్వాగతం పలికి కొబ్బరికాయలు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్‌ గుప్తా, ఆలయ కమిటీ చైర్మన్‌ జంగం శాంతయ్య, గజవాడ జైపాల్‌, బూస సుదర్శన్‌, యాదగిరి, గడ్డం కిష్టారెడ్డి, గురడి నర్సారెడ్డి, గజవాడ రాములు, మహేందర్‌రెడ్డి, గడ్డం లక్ష్మణ్‌, ఏజీ దాస్‌, గడ్డం నర్సారెడ్డి, సున్నం పోశెట్టి, సూర మాధురి, ఆసది జితేందర్‌, గజవాడ విజయనాథ్‌, రేణుకా దాస్‌, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు వన విహారం.. చక్రతీర్థం

ఉత్సవాల్లో భాగంగా గురువారం గ్రామ శివారులోని అంగడి మామిళ్ల వద్ద శ్రీ సీతారాముల వనవిహారం(జాతర), చక్రతీర్థం నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామి వారికి గజసేవ నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు సుమిత్‌శర్మ దేశ్‌పాండే తెలిపారు.

యూజీసీ ముసాయిదా ఉపసంహరించుకోవాలి

రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో విద్యార్థి సంఘాల డిమాండ్‌



రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో మాట్లాడుతున్న తెయూ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ పున్నయ్య

తెయూ(డిచ్‌పల్లి): నూతనంగా తయారు చేసిన యూజీసీ ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకునే వరకు విద్యార్థి సంఘాలు ఉద్యమించాలని తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ ఏ.పున్నయ్య పిలుపునిచ్చారు. యూజీసీ ముసాయిదాను వ్యతిరేకిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తెయూ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజ్‌ మినీ సెమినార్‌ హాల్‌లో బుధవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్‌ సమావేశంలో పున్నయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

ఇదివరకు ఉన్న ప్రభుత్వాలు యూజీసీలో అనేక మార్పులు చేశాయని, ప్రస్తుతం ఫెడరల్‌ స్ఫూర్తికి వ్యతిరేకంగా విద్యావ్యవస్థలో మార్పులు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రాల పరిధిలో ఉన్న యూనివర్సిటీల నిర్వహణ, నియామకాలు చేపట్టే ప్రక్రియ కేంద్ర ప్రభుత్వం యూజీసీకి అప్పగిస్తోందని తెలిపారు. నూతన ముసాయిదాను అమలు చేస్తే రాష్ట్రాలు యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కోల్పోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసేందుకే కేంద్రం తమకు అనుకూలంగా ఉండే విధానాలు, సిలబస్‌ను ప్రవేశపెడుతోందని విమర్శించారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జే.రాజేశ్వర్‌ అధ్యక్షత వహించిన సమావేశంలో తెయూ ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి పృథ్వీరాజ్‌, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు సాగర్‌ నాయక్‌, పీడీఎస్‌యూ నాయకులు ప్రిన్స్‌, రాకేష్‌, హుస్సేన్‌, ఆకాశ్‌, దినేష్‌, దేవిక తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికంగా మనదేశం ధనవంతమైనది

- త్రిపుర గవర్నర్‌ నల్లు ఇంద్రసేనారెడ్డి



మోపాల్‌: ఆధ్యాత్మికంగా, సంస్కృతీపరంగా భారతదేశం అత్యంత ధనవంతమైనదని త్రిపుర గవర్నర్‌ నల్లు ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో మా పల్లె సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో కవులను ఆయన ఘనంగా సత్కరించారు. అనంతరం ఇందూరు అన్నమయ్య నర్సింహారెడ్డి రచించిన పాటల సీడీ ‘శ్రీనివాసం’ను ఇంద్రసేనారెడ్డి ఆవిష్కరించారు. అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ, ప్రముఖ నిర్మాత, టీఎఫ్‌డీసీ చైర్మన్‌ దిల్‌రాజు, జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌ పల్లె గంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు నరాల సుధాకర్‌ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు



పాల్గొన్న బోధన్‌ ఫస్ట్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ సాయిశివ

ఎడపల్లి(బోధన్‌): ఎడపల్లి మండలం జానకంపేటలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి రథోత్సవం నిర్వహించారు. జిల్లాలోని నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారిని బోధన్‌ ఫస్ట్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ సాయిశివ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నేడు కుస్తీ పోటీలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో జిల్లాతోపాటు మహారాష్ట్ర, కర్ణాటకకు చెందిన మల్లాయోధులు పాల్గొననున్నారు.

‘డయల్‌ 100’ దుర్వినియోగంలో రెండు రోజుల జైలు

ఆర్మూర్‌: డయల్‌ 100ను దుర్వినియోగం చేసిన వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ సెకండ్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ గట్టు గంగాధర్‌ తీర్పు వెలువరించినట్లు నందిపేట ఎస్సై చిరంజీవి బుధవారం తెలిపారు. మాక్లూర్‌ మండలం మెట్టు గ్రామానికి చెందిన కట్ట సంపత్‌ నందిపేట మండలంలోని అత్తగారి ఇంటి వద్ద గొడవ జరుగుతోందంటూ డయల్‌ 100కు పదేపదే ఫోన్‌ చేశాడు. అనవసరంగా ఫోన్‌ చేసి విధుల్లో ఉన్న అధికారుల సమయాన్ని వృథా చేయడంతో సంపత్‌పై నందిపేట పీఎస్‌లో కేసు నమోదు చేసి రిమాండ్‌ తరలించగా, రెండు రోజుల జైలు శిక్ష పడినట్లు తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం



భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన తిరుపతి అదృశ్యమైనట్లు ఎస్సై ఆంజనేయులు బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. జంగంపల్లి గ్రామానికి చెందిన మంగలపల్లి లక్ష్మితో దోమకొండకు చెందిన తిరుపతికి 30ఏండ్ల క్రితం వివాహమైంది. వీరి కుమారుడు ప్రవీణ్‌ నెల క్రితం గల్ఫ్‌కు వెళ్లాడు. మతిస్థిమితం లేక తిరుపతి పలుమార్లు ఇంటి నుంచి బయటకు వెళ్లి కొన్ని రోజుల తర్వాత వచ్చేవాడు. గత 15రోజులుగా తిరుపతి కనిపించడం లేదని భార్య లక్ష్మి ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇస్రోజీవాడిలో మరొకరు..



కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన కొత్తె రాజు అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి తెలిపారు. ఈ నెల 10న కల్లు దుకాణంలో పని ఉందని చెప్పి ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. మొబైల్‌ స్విచ్ఛాఫ్‌ ఉండటంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. రాజు భార్య భూలక్ష్మీ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పోతంగల్‌లో బాలుడు..

పోతంగల్‌ (రుద్రూర్‌): పోతంగల్‌ గ్రామానికి చెందిన సాయి(16) అనే బాలుడు అదృశ్యమైనట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. సాయి బుధవారం మధ్యాహ్నం చేపలు పట్టేందుకు పోతంగల్‌ శివారులోని మంజీరా నది వైపు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు వెతుకుతుండగా నది ఒడ్డున బాలుడి దుస్తులు లభించాయి. తండ్రి గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్‌

కారులో పెట్టిన రూ. 2లక్షలు చోరీ

బాన్సువాడ: కొబ్బరిబోండం తాగి వచ్చేలోపే కారులో ఉన్న రూ.2లక్షలు చోరీకి గురైన ఘటన బాన్సువాడలో చోటు చేసుకుంది. సీఐ అశోక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇబ్రహీంపేట్‌ గ్రామానికి చెందిన చందర్‌ ఈ నెల 10న బ్యాంకు నుంచి రూ. 2 లక్షల నగదు డ్రా చేసుకొని కారులో పెట్టాడు. అనంతరం ఏరియా ఆస్పత్రి వద్ద కారు నిలిపి కొబ్బరిబోండం తాగేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి కారులో ఉన్న నగదు మాయమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలంలోని సీసీ ఫుటేజీని పరిశీలించారు. ఓ వ్యక్తి కారు డోర్‌ తీసి నగదు తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. కారు డోర్లకు లాక్‌ వేయకపోవడంతోనే చోరీ జరిగినట్లు తెలిసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మొరం టిప్పర్‌ పట్టివేత



ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్‌ పరిధిలో మొరం అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్‌ను సీజ్‌ చేసినట్లు ఎస్సై గంగాధర్‌ తెలిపారు. టిప్పర్‌ యజమాని బొల్లం నర్సయ్యతో పాటు డ్రైవర్‌ ఎత్తరి చిన్నకొండయ్యపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఇసుక, మొరం అక్రమ రవాణాకు పాల్పడిన వారిలో నాగారం వడ్డెర కాలనీకి చెందిన మక్కల గోపాల్‌, దండ్ల సాయికుమార్‌, మల్లారం గ్రామానికి చెందిన బొల్లం నర్సయ్య, మమ్మాయి అరుణ్‌, బొల్లం నర్సయ్యను నిజామాబాద్‌ దక్షిణ మండల తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఎస్సై తెలిపారు.

తారకరామ్‌నగర్‌లో ఇసుక లారీ..

నిజామాబాద్‌ రూరల్‌: రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని కంఠేశ్వర్‌ బైపాస్‌ వద్ద తారక రామ్‌నగర్‌లో ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకొని సీజ్‌ చేసినట్లు ట్రైనీ ఐపీఎస్‌ సాయికిరణ్‌ బుధవారం తెలిపారు. ఇసుక, మొరం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టుకున్న లారీని రూరల్‌ పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ యజమానికి జరిమానా

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను నాగిరెడ్డిపేట ఫారెస్ట్‌ రేంజ్‌ అధికారులు పట్టుకున్నారు. వివరాలు ఇలా.. మెదక్‌ జిల్లా రాజ్‌పేటతండాకు చెందిన సోమ్లా ఎలాంటి అనుమతి లేకుండా తన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా లింగంపేట మండలం కన్నాపూర్‌ గ్రామ శివారులో పట్టుకున్నట్లు ఎఫ్‌ఆర్వో వాసుదేవ్‌ తెలిపారు. ట్రాక్టర్‌ యజమానికి రూ.10వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఫారెస్ట్‌ రేంజ్‌ ఆఫీసర్‌ రవికుమార్‌, బీట్‌ ఆఫీసర్‌ సమ్రీన్‌, బేస్‌క్యాంపు గోపాల్‌ ఉన్నారు.

గోదావరిలో యువకుడి గల్లంతు



సాయిబాబా

రెంజల్‌(బోధన్‌): కందకుర్తి త్రివేణి సంగమంలో పుణ్యస్నానమాచరించేందుకు వచ్చిన ఓ యువకుడు గల్లంతైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. రెంజల్‌ పోలీస్‌స్టేషన్‌ హెడ్‌కానిస్టేబుల్‌ శంకర్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటగిరి మండల కేంద్రానికి చెందిన సాయిబాబా, అతని మేనమామ మక్కయ్య బుధవారం కందకుర్తి గోదావరికి వచ్చారు. స్నానం చేసేందుకు ఇద్దరు కలిసి నదిలో దిగారు. కాసేపటికి మక్కయ్య బయటకు రాగా, సాయిబాబా రాలేదు. స్థానికులు గాలించినా జాడ తెలియకపోవడంతో మక్కయ్య వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ విషయమై కోటగిరి పోలీసులకు తెలుపగా వారు బోధన్‌ రూరల్‌ సీఐ విజయ్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. సీఐ ఆదేశాలతో రెంజల్‌ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సాయిబాబా గల్లంతైనట్లు గుర్తించారు. స్థానిక జాలర్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. భార్య సుష్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్‌ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురు మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వర్ని: మండల కేంద్రంలోని జాకోర క్రాస్‌రోడ్డు వద్ద బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై రమేష్‌ తెలిపారు. మంగళవారం రాత్రి బాన్సువాడ నుండి నిజామాబాద్‌ వైపు వెళ్తున్న బస్సు గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని నిజామాబాద్‌ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి వయసు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, వివరాలకు వర్ని పోలీస్‌ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

కుంటలో పడి రైతు..



బాలయ్య మృతదేహం

నిజాంసాగర్‌(జుక్కల్‌): మండలంలోని ఒడ్డేపల్లి గ్రామ శివారులో ఉన్న పాపేశ్వరుని కుంటలో పడి కంద్రపల్లి బాలయ్య(60) అనే రైతు బుధవారం మృతి చెందినట్లు ఎస్సై శివకుమార్‌ తెలిపారు. కుంట తూము నుంచి పొలానికి నీరు పారించేందుకు వెళ్లిన బాలయ్య ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడని పేర్కొన్నారు. మృతుడి కుమారుడు రమేష్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

బాల్కొండ: ముప్కాల్‌ మండలం వేంపల్లి శివారులో జాతీయ రహదారి 44పై బుధవారం ఉదయం సుమారు 4గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని, గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై రజనీకాంత్‌ తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై కాలినడకన వెళ్తున్న సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడు లుంగీ, తెల్ల చొక్కా ధరించి ఉన్నాడని, కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ఆర్మూర్‌ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. వివరాలకు ముప్కాల్‌ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

విద్యుదాఘాతంతో చెరుకు కూలీ మృతి



వెంకటి (ఫైల్‌)

మాచారెడ్డి : చెరుకు నరకడానికి వచ్చిన ఓ వలస కూలీ విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన బుధవారం పాల్వంచ మండలం ఆరెపల్లిలో చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై అనిల్‌ తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట మండలం ఎక్కపల్లితండాకు చెందిన కొర్ర వెంకటి (25) మూడు నెలలుగా చెరుకు నరకుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆరెపల్లిలో చెరుకు నరకడం పూర్తి చేసుకున్న తర్వాత నివాసం కోసం వేసుకున్న గుడిసెను సర్దుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. తోటి కూలీలు వెంకటిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారని ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో ఇంటర్‌ విద్యార్థి..



అరవింద్‌ (ఫైల్‌)

దోమకొండ: మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన ఇంటర్‌ విద్యార్థి నీల అరవింద్‌(19) అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కామారెడ్డిలోని ప్రైవేట్‌ కళాశాలలో ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అరవింద్‌ రెండు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతుండగా ఆస్పత్రిలో చూపించారు. మంగళవారం రాత్రి నుంచి వాంతులు, విరేచనాలవుతుండడంతో కుటుంబీకులు కామారెడ్డిలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు.

చేపల వేటకు వెళ్లి మరొకరు..



రాజశేఖర్‌ (ఫైల్‌)

భిక్కనూరు: చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు బుధవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన చెట్లపల్లి రాజశేఖర్‌ (33) ఈ నెల 10న ఉదయం చేపలు పట్టేందుకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. భిక్కనూరు బొబ్బిలి చెరువు గట్టుపై చెప్పులు, టీషర్టు, ప్యాంట్‌, సెల్‌ఫోన్‌ కనిపించాయి. చెరువులో గాలించగా రాజశేఖర్‌ మృతదేహం లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి, మృతుడి తండ్రి లక్ష్మణ్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్ర సమీపంలోని గాంధీనగర్‌లో పోలీసులు బుధవారం రేషన్‌ బియ్యం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో ఎస్సై అనిల్‌రెడ్డి సిబ్బందితో కలిసి కొండపల్లి లక్ష్మణ్‌ ఇంట్లో తనిఖీ చేసి 5.20 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. పంచనామా అనంతరం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్‌ దొంగల రిమాండ్‌

- కొనుగోలు చేసిన వ్యక్తి సైతం..



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఆర్మూర్‌ రూరల్‌ సీఐ శ్రీధర్‌రెడ్డి

బాల్కొండ: ట్రాక్టర్‌ ఇంజన్‌, ట్రాలీ చోరీ కేసులో నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఆర్మూర్‌ రూరల్‌ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బాల్కొండ పీఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బాల్కొండ మండలం నాగాపూర్‌ గ్రామానికి చెందిన ఎంబరి మహేశ్‌ గత ఆదివారం తన పొలం వద్ద ట్రాక్టర్‌ ఇంజన్‌తోపాటు ట్రాలీని నిలిపిఉంచాడు. కోటగిరి మండలం సుంకిని గ్రామానికి రాజు, ఏర్గట్ల మండలం తొర్తికి చెందిన మందుల అరవింద్‌, నిర్మల్‌ జిల్లా ముథోల్‌ మండలం రాంటెక్‌కు చెందిన తమ్మల రవి ఆదివారం రాత్రి ట్రాక్టర్‌, ట్రాలీని దొంగిలించారు. అనంతరం వాటిని మహారాష్ట్రకు చెందిన విఠల్‌ మోహన్‌కు విక్రయించారు. కేసు దర్యాప్తులో భాగంగా నాగాపూర్‌లో ఉండే మందుల అరవింద్‌ కనిపించకపోవడంతో పోలీసులు ఆరా తీసి నిందితులను పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను కొనుగోలు చేసిన విఠల్‌తోపాటు ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. నిందితుడు రాజు గతంలో దొంగతనాలు చేసి ఆరుసార్లు జైలు శిక్ష అనుభవించాడన్నారు. మూడు రోజుల్లో కేసును ఛేదించి దొంగలను పట్టుకున్న ముప్కాల్‌ ఎస్సై రజనీకాంత్‌తోపాటు సిబ్బందిని అభినందించారు.

తనిఖీల్లో పట్టుబడ్డ బంగారం



ఖలీల్‌వాడి: ఇళ్లలో చోరీకి పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు సౌత్‌ సీఐ సురేశ్‌ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని అర్సపల్లిలో బుధవారం వాహనాల తనిఖీలో భాగంగా స్కూటీపై వెళ్తున్న షేక్‌ అఫ్తాబ్‌పై పోలీసులకు అనుమానం కలిగింది. దీంతో వాహనాన్ని పూర్తిగా తనిఖీ చేయగా డిక్కీలో బంగారు ఆభరణాలతోపాటు దొంగతనాలకు ఉపయోగించే వస్తువులు లభించాయి. వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకుని తొమ్మిదిన్నర తులాల బంగారు ఆభరణాలు, రెండు వాచీలు, ఒక సెల్‌ఫోన్‌, స్కూటీ, రూ. 15వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మూడు ఇళ్లలో చోరీకి పాల్పడినట్లు నిందితుడు ఒప్పుకున్నాడని పేర్కొన్నారు. కేసును ఛేదించిన ఎస్సై వెంకటరావు, సిబ్బందిని అభినందించారు.